


# విపజ్జీవితాలు

పుస్తకం మూసీసేను. కొంచం ఆవలించి, టేబిల్ మీద మోచేతులాని కుర్చీలో అలానే కూర్చొని ఆలోచనలో పడ్డా.

బెడ్ లైటు మసక మసకగా వెల్గుతూంది. ఆ చిన్న లైట్ తోనే యీ రెండేళ్లూ గడుపుకు వచ్చేను.

శ్రీమతి 'ఒకకొత్తలాంతరు కొనండీ' అని ప్రతినెలారంభాన జీతంపుచ్చుకున్ననాడు పోరుపెడ్తుంది. అయినా చదువుల గదిలో యీ బెడ్ లైట్, వంటయింటో బుడ్డీ దీపం, భోజనాలదగ్గర పెద్దసీసా బోదురుదీపమే వెలుగుతున్నాయ్.

కొత్తలాంతరు కొన్నే లేదు.

కిటికీలోంచి ఝుంయ్‌మని గాలి కొట్టింది. భగ్ మని బెడ్ లైట్ మండి ఆరిపోయింది. నేనుమాత్రం కదల్లేదు. అలా కుర్చీలో టేబిల్ కు చారబడే వున్నాను.

సినీమా ప్రేక్షకుల అలికిడి క్రమంగా తగ్గిపోయింది. ఇంటో అంతా సమస్తాన్నీ మరచి పరలోకంలో వున్నట్టు నిద్రిస్తున్నారు. నేనుమాత్రం చీకట్లో వీధిగదిలో వున్నాను.

కిటికీవూచల తాకిడి చప్పుడయింది. వెనక్కి తిరిగేను. కిటికీలోంచిసన్నగా పడిన వెలుతురుకిరణం గోడమేకుకి తగిలించిన నాలాల్చీ లేనట్టు చెప్పింది. గాభరాపడ్డా-

గభాల్న బయటకు వచ్చి చూసేను. ఒక వ్యక్తి అప్పుడే పరుగు పుచ్చుకోబోతున్నాడు. నాగుండె దఢక్ మంది. ఆ జుబ్బాలో నా రూపాయిన్నర పెన్నుంది. చాకింటిలాల్చీ నిన్ననే చాకలితెస్తే తొడుక్కున్నా. ఆపెన్ను లేకున్నా, ఆ లాల్చీ లేకున్నా కాలక్షేపం జరగదు తెల్లారిన నుంచీ.

పరిగెత్తేను అతని వెనకాలే- పదిగజాల్లో ఎదురుగా ఎవరో వస్తూంటే 'దొంగ దొంగ పట్టుకోండి' అని కేక వేసేను. ఎదురువ్యక్తి పట్టుకున్నట్టు నటించి తనూ మొదటివాణ్నే అనుసరించేడు. అతడూ ఆ జట్టే నేమో!

నా చిన్నకేకల్తోనే అరుగుమీద పడుకున్న మరిద్దరు మగవారు నాకు సాయపడ్డారు. పరుగెత్తేము. ప్రక్కవీధితిరిగి సందులోకి మాయమవుతూ నామీద కటాక్షించేరేమో అన్నట్లు చొక్కా కాలువ ప్రక్కగా పారీసేరు.

అవును-, ఆరూపాయిన్నర పాతపెన్నూ, కొన్న ఆరునెలల్లో యిరవై రేవుల్లో నలిగి జీర్ణమైన ఆచొక్కా వాళ్లకేం వుపయోగిస్తుంది.

నాసహాయకులు లాల్చీ నా కందిస్తూ 'చూడండీ, రాత్రులు కొందరు దుష్టవాళ్లు కేపు వేయటానికై తిరుగుతూవుంటారు నిరతం- తలుపులు వేసుకొని పడుకోవాలి. చొక్కా లేవీ కిటికీలోంచి అందేట్లు వుంచకూడదు' అని మందలించేరు. వీరికంటే ఆ దొంగలే నాకు బుద్ధి చెప్పేరు- బుద్ధి చెప్పడమేకాదు క్రొత్తజ్ఞానోదయం చేసేరు.

నాగదిలోకి వచ్చి కూర్చున్నా. వీళ్ల కర్తృత్వంలో దొంగతనం వచ్చింది. ఇలా చేస్తూ ఒక్క రోజులో మళ్లా సంపాదనంతా దూబరాగా ఖర్చెట్టి పెట్టేస్తారు.

నాగదిలోకి వచ్చి కూర్చున్నా. వీళ్ల కక్కుర్తి దొంగతనంగురించి నవ్వు వచ్చింది- యిలా చేస్తూ ఒక్క రోజులో మళ్లా సంపాదనంతా దూబరాగా ఖల్సాలకి వెచ్చించేస్తారు. యీ సందర్భాల్లో శ్రీకృష్ణజన్మస్థానంలో కూర్చునే అవుసరం, ఎముకలు విరిగినట్లు తన్నులు తినే స్థితి తటస్థిస్తూవుంటుంది.

'మహస్వా'

అన్నీ భరిస్తూ 'పొదుపూ, కుటుంబ పోషణ లేక మళ్ళా యిదే చేస్తారు రోజూ. దరిద్రులు! నీతిలేని దరిద్రులు వీళ్లు.

ఏరాత్రో వచ్చి మాఆవిడ యింట్లోకి తీసుకుపోయింది; వీధిగది గడియ వేసి-

* * *

ఉదయాన్నే కాఫీ తాగుతూ రాత్రి సంఘటన చెప్పేను. తిరిగి రెండు చెప్పు దెబ్బలు తినేటంత పనైంది. 'నే అనుకుంటూనేవున్నా. మీ రిలాగే వీధిగదిలో వున్న రెండుమూడు పనికివచ్చే సామానులూ ఎవళ్లకో అప్పచెప్పేస్తారని. రేపట్నుంచి మీరు వీధిగోట్లో రాత్రి పది తర్వాత ఉంటే వొప్పుకునేదిలేదు. మీరలా కుర్చీమీద కూర్చుంటేగానే మాగన్ను పట్టేసిందంటే మీ ప్రక్కనుంచే యింట్లోకి ఏదొంగవెధవైనా ప్రవేశించి ఒక కంచు గ్లాసుముక్క తీసుకుపోతే చాలదూ? కాఫీ త్రాగడానికి వెలితివస్తుంది' అని హెచ్చరించింది—

ఆరున్నర బూరా 'బంయ్' మని పెద్ద కేక వేయసాగింది. రెండు గుక్కల వేడికాఫీ ఒక్క గుక్కలో గొంతులో వొంపుకొని వీధిగుమ్మం దిగేను.

ఎదురుగా సూర్యభగవానుడు వుదయించినా ఏదో వ్యాధిగ్రస్థునివలె, మనోవికలునివలె నజ్జుగా వున్నాడు. కాంతివిహీనంగా మసాబులో కనుపిస్తూన్నాడు.

ప్రతిఉదయం నేను ఆ దారంట వెళ్తూంటే ఆ ఉదయభానుడు అలా నీరసంగా కనుపిస్తూనేవుంటాడు.

అయితే ఎందుకలా రూపిస్తాడు అన్నదానికి రెండు జవాబులు తట్టాయి నాకు- ఒకటి నన్ను, నా అసంపూర్ణ సుఖానుభవంలో వస్తూన్న ఒడుదుడుకుల్నీ, నిత్యయాతనల్నీ చూచో, లేక తనకళ్లముందు అనంతకోటి జీవరాసుల సుఖదుఃఖాల ముమ్మరంమాట ఆటుంచి తన ఉదయరాగవేళ కనులు విప్పేసరికే జీవనయాతనల్లో మునిగిన దీన పాటక జనాన్ని చూసో—

సూర్యభగవానుడే కాదు. కడలిరాజు కూడా అంతే- ప్రశాంత గభీరమయిన తన హృదయంలోంచి ఆ వేదనాపూరితాలైన దుఃఖతరంగాల్తో చెలియలకట్టను తట్టి భూలోకవాసుల విపజ్జీవితాన్ని చెప్పి రోదిస్తాడు. అవును- ప్రకృతికైనా ప్రకృతిఅధినేతకైనా గుండె కరుగదా! హృదయంలోంచి వేదన పొంగి పోర్లదా?

జాలరిఆడంగులు తెల్లవారకముందే నానబెట్టిన కొబ్బరిడొక్కలను బరువైన కఱ్ఱదుక్కల్తో బాదటం ప్రారంభిస్తారు. పీచు సాఫుదేరేవరకూ మర్దన చేస్తూవుంటారు. పూరవుదయానే తమపనుల్లో చెమట్లు పోసేటంతగా శ్రమిస్తూంటారు. చేతులెత్తి కదలిపోతూ, ఆయాసంతో చేసే ఆపనిలో వారి బక్కపేగులు, వాడిపోయిన ముఖాలు ప్రత్యక్షమవుతూవుంటాయి.

తీరాన కొందరు జాలర్లు వలల్నిసముద్రంలోకి విసిరి చేపలకోసం గాలిస్తారు. ఇంకొందరు శాంతమయిన సముద్రమధ్యంలో పడవలపై ఆహారంకోసం దేవుల్లాడుతారు.

తొందర తొందరగా భుజాలపై వలలు మోసుకుంటూ ముసలిజాలర్లు బాలయువకులజోడీతో నడుస్తూంటారు. ఆడంగులు చేపల బుట్టల్ని బుజ్జమీద పెట్టుకొని పరుగు నడకతో వెళ్తూంటారు.

రోడ్డుప్రక్కగా ఒకచోట బక్కచిక్కిన ముసలమ్మ గోనెబరచి సెనక్కాయల పోగులు సర్దుతూంటుంది.

విరిగిపోయిన రాతిగట్టుమీద కూర్చొని పక్షవాతంతాత ఒకడు దారంట పరిచయమున్నదాతల్ని చూసి చెయ్యిచాస్తూంటాడు. ఇంకా అనేకతరగతుల బీదజనం గోచరిస్తారు. ఆ బీచిరోడ్డంటే వెళ్తూ నేను ఎంతో బాధపడ్తాను. రోజూ ఈ వేదనా ఘట్టాల్ని చూస్తాను. రోజూ గుండె గుబులుతో క్రుంగిపోతూంటాను. /

బీచిరోడ్డు వదలి మలుపుతిరిగి నా గమ్యస్థానానికి వెళ్లేను. ఆవీధినిండా ఎన్ని ధనిక కుటుంబాలు! వారి యిండ్లలో ఎందరు నౌకర్లు! ఎందరి శ్రమఫలితాన్ని కాలు కదపక రవంత కష్టంలేక ఆ ధనికులు అనభవిస్తున్నారు. హాయి విసువు లేక నెలరోజులు ఆ జాలరిపాటకజనం చెమటోడ్చి సంపాదించవలసే భత్యం, రోజుకు రెండణాలవంతున మూడునెలలకుగానీ ముసలమ్మ ఆర్జించలేని ధనం, నేను జీతంకాక రోజువారీ అదనంగా ఆర్జించగల నెలరోజుల సొమ్ము ఒకరోజులో పండ్రెండు గంటల్లో ఒక్కధనికకుటుంబం ఖర్చు చేయిస్తున్నది. అందులో మూడువంతులు తిండీ తిప్పలకే అవుతుంది. కొంత మాత్రం శ్రామికులకు ప్రతిఫలంగా అందుతుంది.

నా లెక్కల జమాఖర్చులు వ్రాయటం అవగానే యింటిముఖం పట్టేను. స్నేహితుడొకడు కల్సి చేబదులడిగేడు- వూఁవూఁ ఏమట్టే లేదు. రూపాయకు తక్కువైన చిల్లరే వుంది. అందుకొని ఏదోకొంత తృప్తిపడ్డాడా మిత్రుడు.

* * *

వాలుకుర్చీలో కూర్చొని మార్గాయాసం తీర్చుకుంటూంటే యజమానురాలు వచ్చి యివాళకు బియ్యం లేవంది.

పోనీ అన్నాను-

'భోజనం సున్నా'

'అలాగే అవనీ'

'ఆకలి వేస్తుంది-మరి పిల్లలో - నేనో?'

'పస్తుండాలి'

'అలా ఎలా అవుతుంది. మేం నిరాహారంగా వుండము'

'అంతకంటే చేయగలిగిం దేముంది. లేకుంటె రెండేసి గోధుమరొట్టెలు చెయ్యి. తిందాం—'

'ఆ పిండీ అయిపోయింది'

'మినప్పప్పు నానవేసి అట్లు వెయ్యి'

'అదైనా కొంచెమే వుంది. బంగాళాదుంప ఒక వీసెడు తీసుకురండి'

'డబ్బులున్నాయా?'

'రాత్రి రూపాయి మార్చేరే. అయిపోయిందిటండీ'

'ఊఁ అయిపోయింది-కనుకే లేదు-'

'అదేంటండీ—మీరు మరీన్నూ?'

'అవును-దార్లో స్నేహితునికి అవుసరమైందది. నీ పెట్లో ఏమైనా మిగిలివుందేమో వెతుకు—'

'ఇంకేముంది నా తలకాయ'

'నీ తలకాయ వుందిలే-ఆ తలకాయలో ఏ మూలనైనా ఏమాత్రం చిల్లరైనా పెట్లో వున్నట్లు జ్ఞాపకం వుందేమో చూడు'

'మీ రెప్పుడూ యింతే - పైసాకూడా వుంచక వుప్పు కొనుక్కోడానికి కూడా లేకుండా చేస్తారు'

'అంతా యీ నీ కుటుంబానికే'

'మీ కుటుంబం కాదు కాబోలు'

'ఆఁ—మన కుటుంబానికే- తే- యివాల్టికి రొట్టె బంగాళాదుంప తినివుందాం.'

'ఏం పనుల్లెద్దురూ! యిన్ని ఖర్చు లవుతున్నాయి. యింత ఆర్జిస్తారు. అయినా పస్తులు తప్పకుండా వున్నాయి'


## నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిస్సారక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. పి. & కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి-నెల్లూరు జిల్లా.

"ఏంటి సుశీ! నువ్వింత తెలివితక్కువగా మాట్లాడుతావు. ఎందరు మనకంటే దుర్దశల్లో కుందిపోతున్నారు. అసలు రెండేసి రోజులు సెరా తిండి లేక కుడుకుంటున్న కుటుంబాలెన్ని వున్నాయి! పిల్లాపాపకలవాళ్లు ఎంతమంది అర్థాకలితో మలమల మాడిపోతున్నారో వూహించవేం?" అన్నా.

సుశీల మరేం మాట్లాడలేదు. శనివారం శలవునాడైనా స్థిమితంగా విశ్రాంతి తీసుకోలేకపోతున్నందుకు విచారంతో వీధులోకి నడచేను.

* * *

బజార్లో ఒక బడికుఱ్ఱవాని తండ్రి కలిసేడు. తన పిల్లవానిగురించి ఏవేవో ఏకరువు పెట్టేడు. పుస్తకాలు త్వరలో కొంటానని బ్రతిమలాడేడు—చాలా జాలివేసింది. అలాగే నని బుఱ్ఱ వూపేను.

పాపం! నిన్న నోట్సుపుస్తకం తేలేదని ఒకడ్ని, అచ్చుపుస్తకం తేలేదని మరొకడ్ని, పుస్తకాలు ఎందుకు తేలేదని పీడించేను.

'మాస్టారూ! సోమవారం కొంటానన్నారండీ మా నాన్నగారు. ఇవాళ్టికి క్షమించండి – తప్పకుండా తీసుకువస్తా' అని ప్రాధేయపడ్డాడు.

కానీ యిరవైరోజులైనా యింకా తీసుకురాలేదని క్షమింపరాని నేరంగా పేముబెత్తాన్ని ప్రయోగించేను నిరయగా. ఇది తరగతిక్రమశిక్షణను సంరక్షించే విధానమని, లేకుంటే పిల్లలు దార్లో పడరని పాఠశాలాధికార్ల తలంపు.

వాళ్లను బాధించి ఏడిపిస్తేగాని వీల్లేకపోయింది. నెలకూలో, రోజుకూలో తెచ్చుకొని బొటాబొటీగా సంసారం పోషణ జరుపుకుంటూవుండే ఆ గర్భదరిద్రులైన సామాన్యప్రజలు పిల్లల్ని చదివించుకోలేక ఏనాటికో ఒకరు తమపిల్లల్ని చదువుకి పెడ్తేయీ కష్టనిష్ఠురాలు వచ్చిపడ్తూంటాయి. అని చింతపడ్డా

దుంపలు తీసుకువెళ్లి యింట్లో పడేసేను. పిల్ల ఏడుస్తూంటే నాచేతి కందించేసి వీధిలోకి వెళ్లిపోయింది మా ఆవిడ పెరుగు పుచ్చుకోటానికి. ఆ పెరుగుమనిషితో పోట్లాడుతూ కొసరు వేయించుకుంటున్నది.

ఆ పెరుగుమనిషి నాల్గు మైళ్ల దూరం నుంచి ప్రతీరోజు వస్తుంది. ఈమే తెల్లవారుజామున నాలుగ్గంటలకు లేచి పాలు పోస్తుంది. మళ్లా తొమ్మిదింటికి పెరుగు పోస్తుంది. ఏమి యాతన! ఏం జీవితం! ఏ నిశలోనో యింట్లో బయలుదేరి, కాలినడకతో నాలుగో గంటయేసరికి పాలు తెస్తుంది. జోరున వాన పడినా, చలిగాలి వేసినా వరద వచ్చినా, ఎడతెరిపి లేక ముసురు పెట్టినా ఆ పాలమ్మి రావడం మానదు.

ఎందుకా అభంగమయిన యీ విక్రయదీక్ష! తన ఒక్క కడుపుకా? తన తిండి కోసమే అయితే యింత అపేక్ష ఎందుకు? యింకా వున్నా కుటుంబంకోసం, వీలైతే దాచటానికి ఎవరికో, ఎప్పటికో హాయీ విసుపూ లేని పాటుపడటం. ఆమె శరీరంలోని మాంసాన్నీ, సుఖాన్నీ కబళించి జీవచ్ఛవాన్ని చేసేయి. ఏళ్లతరబడి ఆమె జీవనసరళి యిలానే వుంది.

ఆ కష్టజీవిదగ్గర కొసరేంటి అని కసిరేను సుశిని – ఈ ఆలోచనల్లో మైమరచిన నాకు తగిన ప్రాయశ్చిత్తం చేసింది ఒళ్లో చంటిది. తన పసుపు కోటికి నాచొక్కాకు పులిమి చాలా వికృతంగా మార్చింది. ఆ జుబ్బా తొడుక్కొని వీధులోకి వెళ్లటానికి పనికిరాకుండా తయారైంది. వుతుక్కున్నా కొటుకమరకలు వదలవు – ఏంటి గతి భగవంతుడా అని విచారపడ్డాను.

ఇప్పుడప్పుడే భోజనం తయారవదు. ఇంట్లో వుసుపోదు. బయటకు వెళ్దామంటే బట్టలు లేవు. వెతుకుతే చింకిచొక్కా ఒకటి బయటపడింది. చాలా చిరిగింది. మరి కొంత తడవాలోచించగా చిరుగు చొక్కాకు జతకలపడానికి అయిదేళ్లక్రితం కుట్టించిన ఒక పాతికోటున్నట్లు జ్ఞాపకం వచ్చింది. పెట్టె కెలకగా అడుగున వుంది. తీసి తొడుక్కున్నాను.

మా ఆవిడ నాఅలంకరణ చూసి 'ఇదేంటి బుడబుడక్కలప్పయ్యలా తయారయేరు?' అని పరిహాసం చేసింది.

నాకు అరికాల్లోంచి మండుకొచ్చి 'ఫో ఫో! నీకన్నీ అవహేళనలే-చంటిగుంటను నా వొళ్ళో కిచ్చి చక్కా పోయేవ్ – అది నా చొక్కా అంతా ఖరాబు చేసింది మసి, పసుపులతో. యిది గతయింది ఆఖరుకు – అని చరచరా దారి తీస్తుంటే'

'ఉండండీ కాఫీ వెచ్చచేస్తునా త్రాగి వెళ్లిపొండి' అంది. జేబులో దమ్మిడీ లేదు. కాఫీ తాగాలని జ్ఞాపకం వచ్చి నా కోపం మరచి ఆగిపోయేను.

* * *

వెండిగిన్నెఅంచు పెడిమల్ని చురికిస్తూంటే నాల్గు గుక్కలు వేసి రీడింగు రూముకు దౌడుతీసేను.

ఫేనుగాలిలో ఎండధనరు తెలియకుండా చదువు ప్రారంభించేను. అరగంట తరువాత నా కళ్లు ఒకసారి హాలంతా కలయచూసేయ్ – పుస్తకం 'వొళ్ళో' పెట్టుకొని చదువుకొనే వైఖరి మార్చేను. అనుకోకుండానే అలా చేసినామరో అయిదు నిమిషాల్లో ఎవరో దగ్గరకు వచ్చేరు—

'నారాయణం'

ముఖమెత్తి చూసి కొంతసేపు నిశ్చేష్టుడ్నై 'ఆఁ కూర్చో' అంటూ ప్రక్కనున్న కుర్చీ కొంచం జరిపేను

'కూర్చుంటాగాని – మరచిపోయి నట్టున్నావు-'

'అబ్బె! లేదు- జ్ఞాపకముంది. ఈమొదటి వారంలో నీకు తప్పక అందించేస్తాను.'

'ఇది మూడోవాయిదా. యీదఫా తప్పిపోతే బాగుండదుసుమా' కచ్చితంగా మందలిస్తూ అన్న మాటలవి.

మౌనంగా అతని మాటల్ని విన్నాను. వెళ్లిపోతూ అతడనిన మాటలు సూదితో పొడిచినట్లు బాధించేయి.

అసలు అప్పిచ్చిన పెద్దమనిషి కనపడగానే ప్రాణాలు నిలువునా ఎగిరిపోయేటంత వ్యధకల్గుతుంది. ఇక నిలబెట్టి 'అప్పుమాట ఏంచేసేవ్' అని అడుగుతే మరి చెప్పేదేంటి?

నిజంగా ఆపెద్దమనిషి సౌమ్యుడే-మరేం గందరగోళం చెయ్యలేదు నలుగురిలో-రెండునెలలక్రితం అవుసరాని కిచ్చిన బాకీ తీర్చకుంటే ఎలా?

ఏవో నాలుగుపత్రికలు తిరగవేద్దామని వచ్చిన నా చదువుకూ ఆలోచనలకూ అవాంతరం వచ్చింది అసలే స్థిమితం లేకచస్తుంటే యీ ఘాతలు మరీ నన్ను అస్థిమితుని చేస్తున్నాయ్.

నాలాంటివారింకెంతమంది యీహాల్లో వున్నారో! ఎంతమంది కొద్దికాలమైనా యింటి వాతావరణాన్ని మరచి, పత్రికలు చూద్దామని వచ్చారో! అవును- ప్రతినెలా డబ్బు ఖర్చుచేసి యిన్ని పత్రికలు కొనలేక ఒక్క ముప్పావులాతో ప్రపంచాన్నీ, దేశాన్నీ, పరామర్శిద్దామనే చాలామంది తాపత్రయం.

అంగుకే యిక్కడకు ఎడతెరిపిలేని విద్యావంతుల హడావుడి. పదకుండుదగ్గరవుతూంటే రీడింగురూముమెట్లు దిగేను. నా వాలకంవేపు చాలామంది దృష్టి సారించేరు. కానీ తొణక్కుండా ముందుకు లంకించుకు పోయేను.

* * *

భుక్తాయాసం అట్టే లేదు. కానీ అడ్డమైన రొడ్డా కడుపులో కూరడంవల్ల కొంచం పొట్ట భారమయింది. అలా ప్రక్కచుట్టకు బారవేసేను శరీరాన్ని. నిద్రపట్టిందేమో

అనుకున్నా. నిద్రఎలా పడ్తుంది యీ చింతా పరునకు- అయినా అలసిన మనశ్శరీరాలు విశ్రాంతితీసుకున్నాయి ఒక అరగంట నసిలి-

నిద్రలో ఎన్నెన్నో విచిత్రమైన కలలు కన్నాను. బకో యాడార్లు, పత్రికా సంపాదకుల పారితోషకాలుగురించి సుఖమయిన కలలు-

మూడు గంటలు దాటిపోతూందని వేగంగా ముఖం కడుక్కొని బట్టలు వేసుకొని, టీచుక్కలు త్రాగి పైరివేటుకు బయలుదేరేను.

'బద్ధలేని వాడు పైరివేటు కూడా లేకుండే బాగుండును మాష్టారూ' అంటాడు ఒక కుర్రవాడు - బాగుండును. కానీ తల్లిదండ్రులు ఒప్పుకోరు. పిల్లలకి చదువు బాగా రావాలంటారు.

ఒక సిటింగు పూర్తిచేసి రెండోదగ్గరకి వెళ్లేను. అయిదు కొట్టింది వాచీ. కుర్చీమీద కూర్చున్నా - దూరంనుంచి రేడియోబాకా పాడే పాటలు సన్నగా వినిపిస్తున్నాయి. నా చెవులు ఆ వేపు మరలుతున్నాయ్. మళ్లా మందలింపబడుతూ అమ్మాయిచదువులోకి ప్రవేశిస్తూంటాయ్-

పైరివేటు సాగుతూనే వుంటుంది. ద్వంద్వా వధానం, త్రయావధానం చేస్తూంటా- పారంచెప్పటం, చుట్టూన్న ప్రకృతిని అవలోకిస్తూండడం, దూరంనుంచి వినీవినిపించని రేడియోపాటను అంగుకోడానికి ప్రయత్నించడం. కానీ యివన్నీ అసంపూర్ణమైనవే- కోర్కె తృప్తి నివ్వలేవు-

నాకూ రేడియోపాట వింటూ బీచిలో చల్లగాలి ఆవటించాలనీ, గుమగుమలాడే వాసననూనెలు రాసుకుని యిస్త్రీకుస్తులు రెండురోజుల కొక పర్యాయం మారుస్తూండాలనీ, వారానికి నాలుగు సినీమాలు చూడాలనీ, రోజూ వుదయం, మధ్యాహ్నం హోటల్లో కాఫీ టిఫిన్లు పుచ్చుకోవాలనీ, ఎలక్ట్రిక్ దీపాలు, కొళాయి వున్న మేడ యింట్లో కాపురం వెలిగించాలనీ యింకా యింకా నూరు రూపాయల పైచిలుకు అర్జన గలవానికి అందుబడిలో వున్న కోరికలే నాలోనూ ఎల్లప్పుడూ వస్తూంటాయ్.

కానీ జీవనయాత్ర గడవక రాత్రి ఎనిమిదింటివరకు ట్యూషన్లు, ఉదయం లెక్కలచిత్తా వ్రాయటం.

ఇంటద్దెభారంవల్ల చిన్న పదిహేను రూపాయల యిల్లు, అల్ప సదుపాయాలు గల స్థితులతోనే అల్పసంతుష్టున్నయి వుండిపోతూన్నాను-

ఇలాంటి ఆలోచనలతో ఒక్కొక్కనాడు మనఃపూర్వకంగా, ఒక్కొక్కప్పుడు వెట్టిగా ట్యూషన్లు ముగించుకొని యిల్లు చేరుకుంటుంటాను. యీవాళా అలాగే యింటికి చేరుకున్నా.

మనసంతా విపరీతవ్యధతో వేడెక్కివుంది. అప్పతెచ్చి చేసిన గోధుమపిండి రొట్టె తిని యింత తరవాణి తాగి 'విధిగది' లోకి చేరుకున్నా.

మళ్లా రాత్రి వచ్చింది. నిన్నటికన్నా యీరాత్రి మరోలా వుంటుంది. ఇవాళ పొద్దుట్నుంచీ చీకటి ఆవరించివుంది గదంతా. కిరసనాయల్ నిండుకుంది. వంటింటి పనులాగే రావాలా బుడ్డి.

కిటికీ రెక్కలూ తలుపులూ బార్లా తీసేదాగా దగ్గర్లోవున్న ఎలక్ట్రిక్ దీపం రవంత కాంతిని నాగదిలోకి పంపించింది-

కుర్చీలో చతికిలబడగానే మాధవ కవళం అబ్బి కేక వేసేను. లేదు పొమ్మన్నాను. నిజం - ఎక్కడిదీ! పూటగడవని వారు యీదేశంలో ఎందరో వున్నారు. ముష్టివాళ్లు, నిరుద్యోగస్థులు, అంగవిహీనులు, ముసలితొక్కలు, అన్నమో రామచంద్రా అని రోదిస్తున్నారు.

అహో! ఏం మాయా! అపరిమితమైన సమస్యలతో బుర్రంతా ఎంత భారంగా వుంది! నిజంగా యీఘోర దరిద్రాల్లో మునిగి తేలే మానవుడు తన అనుభవగాథలు వ్రాస్తే ఎన్ని వుద్గ్రంథాలు తయారవుతాయ్! సుఖదుఃఖాల్లో కన్నీళ్లూ, నవ్వులొలికించే ఎన్ని ప్రశస్తమయిన విచిత్రకథానికలు రచించగలడు! అవును- రచిస్తున్నాడు. ఏవరో ఒక మేధావి. నావంటి అగర్భదరిద్రుడు వ్రాయలేడు. అగర్భశ్రీమంతుడు మేడలపై వినోదిస్తూ పేదకలల్నీ, సత్యాల్నీ వూహించి వ్రాస్తున్నాడు. ఒకప్పుడు వినికిడితో వ్రాస్తున్నాడనవచ్చు - కానీ నిజంగా అనుభవించి జరిగింది వ్రాయలేడేమో!

నేను అలా కాదు. నేనూ, నాతోటివారలం కొందరం మాత్రం బాధావహులమయిన మా దీనగాథలు, సమస్యలు వ్రాసుకుంటున్నాం.

కానీ బహుశా రసమయప్రపంచం కోసం వెతుకులాడేవారికి నా కథల్లో ప్రీతి కలక్కపోవచ్చు. అయినా నా జీవిత రచన యింతే. నా సమాజంలో, దేశంలో జాతిలో యించుమించు మూడువంతుల పైచిలుకు ప్రజలంతా యింతే - యింకా నాకన్నా నికృష్టమయిన, అధమాధమమయిన దరిద్ర పరిస్థితుల్లో, దరిలేని కుటుంబభారాల్లో నలిగి నమసిపోతూన్నవారే అంతా - దరిలేని విపజ్జీవనాలలో గొప్ప కంగారుపడి కృంగి కృశిస్తున్నారు.

ఒకప్పుడు నేనూ, టాగూర్ నో, శరత్ నో అయితే వారి పాత్రల్లో ఔన్నత్యం, సుఖమయజీవితం చిత్రిద్దునేమో! వారిది జమీందారీఫాయీ. వారి లోకం వేరు - వారి దృక్పథం వేరు. వారూ దీనచరిత్ర వ్రాసేరు. వ్రాయవచ్చు. కానీ అది వారి దీనచరిత్ర కాదు. వారు కనీ విని రచించిన గాథ అయివుంటుంది. వారు అనుభవించి రాయకపోవచ్చు. అంచేత వారూ నేనూ సమానం కాలేం. వారి రచనల్లోని రసం నేను తీసుకురాలేను. ఎంచేత? వారి పరిస్థితులకు జిగిబిగి అలంకరించి, రమ్యంగా కథనం చేస్తారు. నేను పై మెరుగులు పెట్టకే వాస్తవికాన్ని చిత్రించ పూనుకుంటా.

ఉన్నదున్నట్టు నా రచనలో నా ఆవేదన ప్రతిఫలింపచేస్తాను. నిజంగా నాకళ్లు విప్పినా, మూసినా గుండెల్లోంచి ఆలోచిస్తే వేలకువేల అన్నార్తులూ, గర్భదరిద్రులూ, నిత్యబాధావహులూ మనోనేత్రాలకి కనిపిస్తారు. వారంతా ప్రతిరోజూ, ప్రతిక్షణం నాకంటే వేయిరెట్ల ఆవేదనలతో నిండివున్నవారే అయినా నాలానే వారూ సహనంతో జీవిస్తున్నారు చచ్చిపోడానికి దారిలేక. అంతే. ఇది బీదదేశమయిపోయింది. కోటానుకోట్ల భారతజాతీ దరిద్రంలో మునిగి కృశించిపోతూవుంది - స్వతంత్రం పొందిన యీ దీనజనాళికి తిండి గుడ్డా యిల్లు మాత్రం లేవు - యింక వున్న వేంటి? నిత్యదరిద్రం, ఆవేదన - గుండె పగిల్చే జీవనభారం! అబ్బా! కోటానుకోట్ల విపజ్జీవితాలు—

★


**కుష్ఠు ★ బొల్లి**

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటీ చికిత్స, క్యాటలాగు ఉచితం.

జి. వి. రెడ్డి అండ్ కో., "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూర్పు గోదావరిజిల్లా.,

**కాశ్మీర్**

అన్నిదగ్గులకు అమోఘమైనది

గిరిజా & కో., రాజమండ్రి